క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రమేశ్

చింతలమానెపల్లి: మండలంలోని పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి రమేశ్ బాబు తనిఖీ చేశారు. పెంచికల్‌పేట్, అగర్‌గూడ, మేరగూడ, ఎల్కపల్లి పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ సీసీఈలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సీఆర్‌పీ శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారం ప్రారంభం



ప్రచారం నిర్వహిస్తున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ గురువారం పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం మన నేస్తం అని, ఈ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజలకు వివరంగా తెలియజేశారు.

బాధిత కుటుంబానికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్సై

వాంకిడి: మండలంలోని వెల్గీ గ్రామ శివారులో ఖేడెగాం గ్రామానికి చెందిన మహిళా రైతు గేడం పద్మబాయి పిడుగు పాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వాంకిడి ఎస్సై డోలకాని సాగర్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆదివాసీ గిరిజనులకు పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ధన్‌రాజ్, బలరాం పాల్గొన్నారు.

ఎల్కపల్లిలో 'లోక్ అదాలత్'



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన 17 దరఖాస్తులను పరిష్కరించారు. పోతెపల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని, సమస్య పరిష్కరించాలని రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏవో రాజేశ్వర్, ఏఏవో తుకారాం, ఏఈ అంజల్‌కుమార్, ఎస్ఈ అజయ్, వినియోగదారులు పాల్గొన్నారు.

బీజేపీ యువ మోర్చా సమావేశంలో జిల్లా నాయకులు



సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశానికి జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు తేజశ్రీ సూర్య ముఖ్య అతిథిగా హాజరు కాగా, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, నాయకులు వికాస్, నవీన్, సాయి విగ్నేష్ పాల్గొన్నారు.

పరామర్శ

బెజ్జూర్: మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన మడే శంకర్ చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ సంఘటన స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట పోతపల్లి మాజీ సర్పంచ్ ఎల్కరి రమేశ్, బొల్లబోయిన శేఖర్, మడె శ్రీశైలం, శివరాం, రంజిత్ తదితరులు ఉన్నారు.



కాగజ్‌నగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు



దహెగాం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



ఆసిఫాబాద్: మోడల్ స్కూల్‌లో..



పెంచికల్‌పేట్: బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థినులు

పాఠశాలల్లో బతుకమ్మ



కెరమెరి: బతుకమ్మలతో విద్యార్థులు



రెబ్బెన: పులికుంట కాలనీ పాఠశాలలో బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థులు



ఆసిఫాబాద్: శిశుమందిర్‌లో ..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బతుకమ్మ పండుగ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినులు పూలు సేకరించి బతుకమ్మ పేర్చి సంస్కృతి ప్రతిబింబించేలా ఆడిపాడారు.

జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని వట్టివాగు దిశ మోడల్ పాఠశాల, చిర్రకుంటలోని ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ ముందస్తు సంబురాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దిశ మోడల్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి సమీపంలోని నీటిలో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, అధికారులు రవీందర్, వామన్‌రావ్, దినకర్, ప్రధానోపాధ్యాయులు తుకారం, మాధవ్‌రావ్, రవి, సురేశ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిర్రకుంట పాఠశాలలో..

చిర్రకుంటలోని ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్లలో ఎంతో ఉత్సాహంగా తయారు చేసిన బతుకమ్మలతో, నూతన వస్త్రాలు ధరించి తలపై బతుకమ్మలు పెట్టుకొని పాఠశాలకు హాజరయ్యారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్లావత్ ధన్‌రాజ్, విక్రమ్‌రావ్, మల్లేషం, విద్యాకమిటీ చైర్మన్ తిరుపతి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, పీఈటీ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు. వాంకిడి మండలం బెండార ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, ప్రిన్సిపాల్ కనకయ్య అధ్యక్షతన తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సంధ్యారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి మండలి సభ్యులు, మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మాతృమండలి సభ్యులు బాల ఆరద, అమరావతి, సరిత, స్వాతి, రమాదేవి, వైష్ణవి, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడారు. డీజే చప్పుళ్లతో పాఠశాల ప్రాంగణాలు మారుమోగాయి.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బతుకమ్మకు పూజ లు చేశారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. అనంతరం పెద్ద వాగులో నిమజ్జనం చేశారు. ఇందాపూర్ పాఠశాలల్లో జ రిపిన బతుకమ్మ వేడుకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా బతుకమ్మలు పేర్చి వేడుకలు జరుపుకున్నారు.

కౌటాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు.

డిగ్రీ కళాశాలలో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువా రం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)జిల్లా క మిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పాల్గొని బతుకమ్మలతో ఆటపాట నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, ఆయా సంఘాల నాయకులు త్రివేణి, శాంతికుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేశ్, ప్రకాశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థినులు



కెరమెరి: ఇందాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ఆసిఫాబాద్‌అర్బన్: చిర్రకుంట పాఠశాలలో..



కౌటాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

గిరిజనానికి దారి కష్టాలు



కంకర తేలిన బీటీ రోడ్డు

- ఏళ్లు గడుస్తున్నా కచ్చా రోడ్లే దిక్కు
- పట్టించుకోని పాలకులు



అధ్వానంగా చాల్‌బాడీ రోడ్డు

కెరమెరి: గిరి గ్రామాల్లో బీటీ రోడ్లు వేసి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడుతామని పాలకులు చెబుతున్న మాటలు నీటి మూటలవుతున్నాయి. దీంతో ఏళ్లు గడుస్తున్నా వారికి దారి కష్టాలు తీరడం లేదు. మండలంలోని టెమ్లాగూడలో 130 మంది జనాభా ఉండగా, కొలాంగూడలో 177, గొర్యాగూడలో 130, చాల్‌బాడీలో 201 మంది గిరిజనులు నివసిస్తున్నారు. వారికి రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నప్పటికి పట్టించుకునే వారు కరువయ్యారు. టెమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడ గ్రామాలకు దేవాపూర్ నుంచి సుమారు 4 కిలో మీటర్లు పూర్తిగా కచ్చా రోడ్డు ఉంది. వర్షాకాలంలో మోకాళ్లోతూ బురదతో నడక నరకప్రాయంగా ఉంటుంది. చాల్‌బాడికి వెళ్లేందుకు పాటగూడ వరకు మాత్రమే బీటీ రోడ్డు ఉంది. తర్వాత మట్టి రోడ్డుపై అడవుల్లోంచి వెళ్లాల్సి వస్తుంది. పట్నాపూర్ క్రాస్‌రోడ్డు నుంచి ఉన్న బీటీ రోడ్డు కూడా పూర్తిగా అధ్వానంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బీటీరోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. చాల్‌బాడీ గ్రామానికి వెళ్లేదారిలో పాటగూడ వద్ద ఉన్న చెరువుపై, టెమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడకు వెళ్లే దారిలో ఖట్టిగూడ వద్ద ఉన్న వాగుపై వంతెనలు నిర్మించాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

'నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు'

చింతలమానెపల్లి: ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. గురువారం మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. ఎన్నికలకు మాత్రమే వచ్చే ప్రతిపక్షాలను నమ్మవద్దని పేర్కొన్నారు. అనంతరం పార్టీలో చేరిన పలువురికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు డుబ్బుల వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత ప్రదర్శించాలి

జైనూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు నిర్వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేరళ గ్రామర్ పాఠశాల విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జమీల్, ప్రిన్సిపాల్ అఖిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కుద్మేత విశ్వనాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పులికుంటలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రెబ్బెన: మండలంలోని పులికుంటలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్స్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ సంస్థకు చెందిన కళాజాత బృందం బ్యాంకు పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో బ్యాంకు మేనేజర్ విశ్వ ప్రసాద్, ఫీల్డ్ అధికారి శ్రావణ్, టీపీఎస్ ఇమ్రాన్‌రాజు, కళాజాత బృందం సభ్యులు తేజకుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కాగజ్‌నగర్‌రూరల్: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మానిక్‌పటార్, ఈజ్‌గాం, రాంనగర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను గురువారం అధికారులు పరిశీలించారు. మానిక్‌పటార్ గ్రామంలో శాశ్వత భవనాలు లేకపోవడంతో పోలింగ్ బూత్ కోసం నూతనంగా నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఆర్ఐ సాదిక్ తదితరులు పరిశీలించారు.

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి, మర్థిడి, బారెగూడెం, ముంజంపల్లి, కుకుడ, అంబగట్ట తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ భూమేశ్వర్ పరిశీలించారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జీఎం

రెబ్బెన: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల భారత స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సింగరేణి పాఠశాల విద్యార్థులు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, హెచ్‌ఎంలు సంతోష్, రవితేజ, పీఈటీ భాస్కర్, ఉపాధ్యాయులు సృజనకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

దహెగాం: విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరి మట్టి మేరా దేశ్ అమృత కలశయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో దేశభక్తి పెంపొందించేందుకు, అమర వీరుల త్యాగాలను గుర్తించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నోముల చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరుతున్న యువకులు

సిర్పూర్(టి): మండలంలోని హీరాపూర్, చింతకుంట, చుంచుపల్లి గ్రామాల్లోని పలువురు యువకులు గురువారం సిర్పూర్(టి) నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సమక్షంలో కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

15 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ 'శిక్షా వర్గ'

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఈ నెల 15 నుంచి 21 వరకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శిక్షా వర్గ-2023 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కార్యవహ కృష్ణభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షా వర్గ కార్యక్రమానికి హాజరయ్యే వారు ఈ నెల 14లోగా జిల్లా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 15 ఏళ్లు పైబడిన వారు హాజరు కావాలన్నారు. తెల్లచొక్కా, టోపీ, బెల్ట్, దండ తప్పనిసరిగా ఉండాలని, వర్గశుల్కం రూ.300 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యులు నం .9014206234లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌టీపీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న గోవింద్ నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: వైఎస్సార్‌టీపీ ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉండేందుకు గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో బూక్యా గోవింద్‌నాయక్ దరఖాస్తు చేసుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ ఒంటరిగా పోటీ చేస్తుందని పార్టీ అధినేత్రి షర్మిల ప్రకటించిన నేపథ్యంలో ఆసిఫాబాద్ బరిలో ఉండేందుకు గోవింద్‌నాయక్ దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 18, 19వ తేదీల్లో మొదటి జాబితాను పార్టీ ప్రకటించే అవకాశం ఉందని నాయకులు పేర్కొంటున్నారు.

ఎన్నికల కోడ్.. హోర్డింగుల తొలగింపు



గోడలపై రాతలు తుడిపేస్తున్న సిబ్బంది

కౌటాల: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా కేంద్రంలోని రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న పార్టీల రాతలను గురువారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలకు సంబంధించిన హోర్డింగులు సైతం తొలగించారు. గోడలకు అతికించిన పోస్టర్లను చించేశారు. పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, సునీత తదితరులు పాల్గొన్నారు.